ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-అద్దంకి : ఒంగోలుకు చెందిన ఎన్టీఆర్ కళాపరిషత్, అద్దంకి నందమూరి కళాపరిషత్, పట్టణ సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థల ఆధ్వర్యంలో 8రోజుల పాటు అద్దంకిలో తలపెట్టిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన భారతీయ కళాసమితి కాట్రగడ్డ శ్రీనివాసరావు బృందం పట్టణంలో డప్పు విన్యాసాలు, కళాజాతాలతో కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమయింది.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

రోడ్లను వేగవంతంగా పూర్తిచేయండి

విశాలాంధ్ర-చీరాల : కొత్తపేట, ప్రసాదం నగరంలోని రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలని, వీధులన్నీ శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదేశించారు. ఆదివారం చీరాల నియోజకవర్గంలో జరుగు తున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని, రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించాలని,అన్ని ప్రాంతాలు అభివ ృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ శేషయ్య, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు, కొత్తపేట వార్డ్ నెంబర్ శర్మ, ప్రసాద్ నగరం గ్రామ ప్రజలు, కొత్తపేట పంచాయతీ అధికారులు, పొద ప్రసాద్, అనిల్, సాంబశివరావు, అరుణ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ రైతు సంఘం విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా విస్తృతస్థాయి సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు మల్లయ్య లింగం భవన్ (రైతు సంఘం కార్యాలయం) వద్ద జరుగుతుందని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి హనుమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ హాజరవుతారన్నారు. జిల్లాలోని రైతు సంఘం బాధ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర-తాళ్లూరు : వ్యవసాయ భూమిలో పశువుల మేత కోస్తూ విద్యుత్ షాక్‌కు గురికావడంతో ఒక రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన రైతు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొల్లా ఆంజనేయులు ఆదివారం ఉదయం పశువుల మేత కోయడానికి పొలానికి వెళ్ళాడు. సాయంత్రం మూడు గంటల వరకు పొలం వెళ్ళిన ఆంజనేయులు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే విద్యుత్ ఘాతంతో ఆయన మృతి చెంది ఉన్నాడు. పొలానికి వెళ్లిన ఆంజనేయులు ఉదయమే విద్యుత్ షాక్ కు గురై మృతి చెంది ఉంటాడని అటువైపు ఎవరూ లేకపోవడంతో ఈ సంఘటన సాయంత్రం వరకు తెలియ రాలేదని స్థానికులు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ గ్రామ సీనియర్ నాయకులుగా ఆంజనేయులు పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేసిన వ్యక్తి అని అలాంటి వ్యక్తి లేకపోవడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వల్లభనేని సుబ్బయ్య, రామభద్రపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎస్కే అన్వర్ తదితరులు సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-అద్దంకి : క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెసిజి ఎమ్ఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఒంగోలు వైద్య నిపుణులు డా.రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నందు రోటరీ క్లబ్ మరియు హెచ్‌సిజి, ఎమ్ఎన్ఆర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం కార్యక్రమం జరిగింది. డా.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన లేక ప్రజలు తొలిదశలో పరీక్షలు చేయించుకోవడంలేదని కాని తొలి దశలో వ్యాధిని గుర్తించి వైద్యం చేయించుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. వైద్య శిభిరంలో 90మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీకృష్ణ, వీరవల్లి రుద్రయ్య.దివాకరదత్తు, వైద్య శిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం రానివ్వవద్దు

విశాలాంధ్ర - శింగరాయకొండ : సింగరాయకొండ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి దేవస్థానానికి భక్తి శ్రద్ధలతో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా స్వామి వారి కైంకర్యాలు చెయ్యాలని దేవస్థానం అర్చకులను దేవస్థానం పాలక మండలి చైర్మన్ పామర్తి మాధవరావు సూచన చేశారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా ప్రమాణం చేసిన ఆయన ఆదివారం చైర్మన్ గా భాద్యతలు చేపట్టారు. మీడియా ప్రతినిధులతో తన మనోభావాలను పంచుకుంటూ స్వామి వారి సేవ చేసే అవకాశం లభించిందని దాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తానని స్పష్టం చేశారు.స్వామి వారి నిధుల దుర్వినియోగం కాకుండా, దేవాలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు, దేవాలయ పవిత్రత ని కాపాడడమే తమ పాలక మండలి కర్తవ్యం అన్నారు. దేవాలయ సిబ్బంది, అర్చక స్వాములు, పాలక మండలి సభ్యులు సమన్వయంతో దేవాలయ అభివృద్ధి భక్తులకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

ఖోఖో క్రీడలకు అంతర్జాతీయ గుర్తింపు

- జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- సత్తా చాటిన ప్రకాశం బాలికల, పురుషుల జట్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : క్రీడాకారులు సోదర భావంతో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని ఈదర గ్రామంలో ఆదివారం మూడవరోజు ఫైనల్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖోఖో క్రీడకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉన్నందున అందులో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆటల పోటీలు ముగించడం పట్ల నిర్వాహకులను ఆమె అభినందించారు. క్రీడల నిర్వహణకు తమ వంతు సహాయంగా బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా భోజనం ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఖోఖో క్రీడా పోటీలలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలిచిన జట్లకు షీల్డ్ మెమొంటోలు బహుమతులు అందజేశారు. ఆదివారం ఉదయం జరిగిన సెమీ ఫైనల్‌లో మహిళల తూర్పుగోదావరి, ప్రకాశం జట్టు తలపడగా ఆద్యాంతం ప్రకాశం జిల్లా జట్టు ముందంజలో నిలిచి విజయం సాధించింది విశాఖ, కృష్ణా జిల్లా నువ్వా నేనా అన్నట్లు తలపడగా హోరాహోరీగానే కృష్ణ మహిళల జట్టు విజయం సాధించి సెమి ఫైనల్ పురుషుల విభాగంలో ప్రకాశం, విశాఖపట్నం తలపడగా ప్రకాశం జట్టు విజయం సాధించింది. పురుషుల విభాగంలో అనంతపురం విజయనగరం జట్టు తలపడగా విజయనగరం జట్టు విజయం సాధించింది. సాయంత్రం జరిగిన ఖోఖో పోటీలలో ఫైనల్ ప్రకాశం. కృష్ణ మహిళా జట్లు తలపడగా ప్రకాశం విజయం సాధించింది. పురుషుల విభాగంలో విజయనగరం జట్టుపై ప్రకాశం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వంగల పద్మావతి శ్రీనివాస్ రెడ్డి. రాష్ట్ర కోకో సంఘం జనరల్ సెక్రటరీ మేకల సీతా రామిరెడ్డి, జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి భవనం కాశీ విశ్వనాథరెడ్డి, ఎర్రబోలు శ్రీనివాసరెడ్డి, సిహెచ్ సాంబశివరావు, కే సుబ్బారావు, రత్నం, వాడపల్లి శ్రీనివాసరావు, సోమశేఖర్‌రెడ్డి ఎంపీటీసీ నాగమల్లి అంకమ్మరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాష, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ బంక రమణమ్మ నాగిరెడ్డి, మేకల సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

95శాతం హామీలు అమలు చేసాం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అంజాద్ బాషా

విశాలాంధ్ర-కురిచేడు : రాష్ట్రంలో 2019 ఎలక్షన్ సమయంలో జగన్మోహన్‌రెడ్డి మేనిఫెస్టో పొందుపరిచిన పథకాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 95 శాతం పూర్తి చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అంజాద్ బాషా అన్నారు. కురిచేడులో ముస్లిం శ్మశాన వాటికకు ఆరు లక్షల రూపాయల మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ప్రహరి గోడను నిర్మించారు. ప్రారంభోత్సవానికి మహమ్మద్ అంజాద్ బాష ఆదివారం కురిచేడుకు వచ్చారు. దీంతోపాటు కురిచేడు ఎస్‌ఎస్సి కాలనీలో నూతనంగా నిర్మించిన మజీద్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ అలాగే ఈ రాష్ట్రంలో మైనారిటీగా ఉన్న ముస్లింలకు రాజకీయాలలో పదవులు అలంకరణకు పెద్దపీట వేసిందని అన్నారు. మైనార్టీ ముస్లింలందరూ జగన్ ప్రభుత్వం వెంటనే ఉన్నారని రాష్ట్రంలో నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి ప్రతి ఫలాలు అందుతూ ప్రభుత్వానికి ప్రజలు ఆదరణ చూపుతున్నారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు రాష్ట్ర సీఎంగా చేసిన ప్రజలకు వరగపెట్టిందని ఏమీ లేదు అని అన్నారు. వచ్చే 2024 ఎలక్షన్లో జగన్మోహన్‌రెడ్డి గెలుపొంది మరోసారి జెండా ఎగరవేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సైదా బెల్లం చంద్రశేఖర్ మేరువ పిచ్చిరెడ్డి మేరువ సుబ్బారెడ్డి వైయస్సార్ మండల కన్వీనర్ ఎన్నాబత్తుల వెంకటసుబ్బయ్య కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాసిం, కండె గంగయ్య, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రూ.26వేల ఆర్థికసాయం అందజేసిన సూర్య శ్రీ ట్రస్ట్

ఆర్థిక సాయం చేస్తున్న డాక్టర్ బొడ్డపాటి రాజశేఖర్

విశాలాంధ్ర-ఒంగోలు : కంటి సమస్యతో బాధపడుతున్న కురిచేడుకు చెందిన భార్యాభర్తలు మస్తాన్ సాహెబ్ జారబీలకు కంటిలో శుక్లాలు ఆపరేషన్ నిమిత్తం 26 వేల ఆర్థిక సహాయాన్ని ప్రముఖ నీరో సర్జన్ డాక్టర్ బొడ్డపాటి రాజశేఖర్ చేతుల మీదుగా అందజేయమైనది. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సూర్యశ్రీ ట్రస్టు ఏ ఆస్రాలేని నిరుపేదలైన ఈ వృద్ధులకు ఆపరేషన్ చేయించి మానవత్వం చాటారని ఎందరో నిస్సయిలకు సూర్యశ్రీ ట్రస్ట్ అండగా ఆర్థిక సహకారం అందించడం గొప్ప విషయం అన్నారు. హైదరబాద్‌కి చెందిన "ప్లాట్స్ కాక రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రాపర్టీ కాంటెస్ట్ ప్రోగ్రాం" సందర్భంగా ఆ కంపెనీ ఫౌండర్ అండ్ మోటివేషనల్ స్పీకర్ ఎండి జమీర్ ఆర్థిక సహకారంతో ఆపరేషన్లు చేపించడం జరిగింది. సూర్య శ్రీ దివ్యాంగులు చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాషా ఆధ్వర్యంలో ఒంగోలు బృందావన్ నగర్ నందు ఆర్థిక సాయం అందించారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన భైరవకోన, నారాయణస్వామి దేవస్థానాలు

భైరవకోనలో భక్తుల సందడి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భైరవకోన దేవస్థానం, శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాలు కార్తీకమాసం సందర్భంగా ఆదివారం భక్తులతో శివనామస్మరణతో కిటకిటలాడుతూ మారుమ్రోగిపోయాయి. ఆదివారం కార్తీకమాసం మూడవ వారం కావడంతో జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, పర్యాటకులు, భక్తులు పెద్ద ఎత్తున దేవస్థానాలను సందర్శించారు. భైరవకోనలో గత రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో భైరవకోన జలపాతం ప్రవహిస్తుంది. దీంతో జలపాతంను సందర్శించిన వారు పర్యాటకులు, భక్తులు పరవశించిపోతున్నారు. భక్తులు ముందుగా జలపాతం వద్ద స్నానాలు ఆచరించి భైరవకోన సన్నిధిలో కొండపై కార్తీక దీపాలు వెలిగించి మహిళలు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా కార్తీకమాసం సందర్భంగా మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం నారాయణస్వామికి ప్రత్యేకంగా వివిధ రకాల పుష్పాలతో మహా పుష్పయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని నారాయణస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భైరవకోన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, నారాయణస్వామి దేవస్థానం చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి దేవస్థానం ఈఓ నర్రా నారాయణరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పార్టీ మారలేదని కక్ష్య సాధింపులా..?

- టీ బంకును కూల్చి కడుపుకొడతారా..
- ఒంగోలు ఎమ్మెల్యే, అతని కుమారుని తీరుపై దామచర్ల ఫైర్

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న దామచర్ల తదితరులు

విశాలాంధ్ర-ఒంగోలు : వైసీపీ కండుక కప్పుకోలేదని టీడీపీ సానుభూతి పరుడు పై ఒంగోలు ఎమ్మెల్యే అతని కుమారుడు కక్ష్య సాధింపు చర్యలు హేయమని, 25 సంవత్స రాలుగా నడుపుకుంటున్న టీ బంకును కూల్చి వారి కుటుంబం కడుపుమీద కొడతారా అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఫైర్ అయ్యారు. స్థానిక వెంకటేశ్వర కాలనీలో మున్సిపల్ అధికారులు కూల్చివేసిన టీ బంకును ఆయన ఆదివారం పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా రాంబాబు మేనల్లుడు టీ బంకు నిర్వాహకులు చిరంజీవిని వైసీపీ కండువ వేసుకోవాలని పిలుస్తున్నారన్నారు. అతని రానన్నాడని రాంబాబుపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు, చిరంజీవికి చెందిన టీ బంకును కూల్చి వేశారన్నారు. అధికార పార్టీకి చెందిన నాయ కులకు అహంకారం తారా స్థాయికి చేరిందన్నారు. నేడు నగరంలోని పలువరు కార్పోరేటర్లు ఇష్టం వచ్చినట్లు ఎక్కడ పడితే అక్కడ కాల్వలపై ప్రభుత్వ భూములలో బంకులు పెట్టించి అద్దెలు దండుకుంటేంటే పట్టించుకునే నాదుడు లేరన్నారు. 25 సంవత్సరాల నుండి టీ బంకు నిర్వహించు కుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తిపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మంత్రి పదవి తీసేసినా బుద్ధిరాలేదా అని ప్రశ్నించారు. ఆయన కుమారుడు మరింత సైకోగా మారాడన్నారు. కనీసం ఎమ్మెల్యే కూడా కాలేదు అప్పుడే ఇలాంటి నీచపు రాజకీయాలా అని ధ్వజమెత్తారు. పిచ్చి రాజకీయాలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అధికారులపై, పోలీసులపై వత్తిడి పెంచి ఇష్టం వచ్చినట్లు అవినీతికి పాల్పడతారా అన్నారు. వృత్తిపై కొట్టి కడుపులు కోట్టటం దారుణమన్నారు. తండ్రయినా కొడుకుకు బుద్ధి చెప్పాలని హితవు పలికారు. అధికారులు కూడా వారి విధులు మానవత్వంతో నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సోమిశెట్టి శ్రీనివాస్, కమ్మ వెంకటేశ్వర్లు,కామేపల్లి వెంకటేశ్వర్లు, బందారు మదన్, రావుల పద్మజ, నిడమానూరి పావని, కటారి నాగేశ్వరరావు, కఫిల్ బాషా ,పసుపులేటి సునీత, హాజీ మునీసా, చుండి శ్యాం తదితరులు పాల్గొన్నారు.

'దానం' వర్ధంతికి తరలిన నాయకులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బిఎన్ విజయ్ కుమార్ తండ్రి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.దానం వర్ధంతి కార్యక్రమానికి సంతనూతలపాడు మండలం నుండి టీడీపీ అభిమానులు బిఎన్ విజయ్‌కుమార్ అభిమానులు ఆదివారం సంతనూతలపాడు నుండి బస్సులో బయలుదేరి వెళ్లారు. దానం వర్ధంతి కార్యక్రమం కంభం మండలం నల్ల కాల్వ గ్రామంలో జరిగే కార్యక్రమానికి సంతనూతలపాడు నియోజకవర్గం నుండి సంతనూతలపాడు మాజీ సర్పంచ్ బాపట్ల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య నాయకత్వంలో రెండు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-మార్కాపురం : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విదంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 31 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని శాసనసభ్యులు కెపి నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు మాజీ సిఎం చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లు కలసి ప్రచారం చేసి బూటకపు హామీలు ఇచ్చారని విమర్శించారు. అయితే ఏ ఒక్క హామీని అమలు పరచకుండా గాలికి వదిలేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. మార్కాపురం నియోజకవర్గం లో దాదాపు 16 వేల మందికి ఇళ్ళు మంజూరు చేయడం జరిగింద న్నారు. ఇళ్ళ నిర్మాణాలపై ఆరోపిస్తున్న రాజకీయ నాయకులు ఎవరైనా ఇళ్ళ నిర్మాణాలు చేసేందుకు ముందుకు వస్తే వారితో కూడా ఇళ్ళ నిర్మాణాలు చేయిచేందుకు తాము సిద్దంగా ఉన్నామని తెలిపారు. 2019 ఎన్నికలలో జగన్ ఇచ్చిన హామీలను వంద శాతం అమలుపరచిన ఏకైక ప్రభుత్వం జగనన్నదేనని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైసీపీ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె.ఇస్మాయిల్, మార్కెట్ యార్డు చైర్మెన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్స్ బుశ్శెట్టి నాగేశ్వరరావు, దారివేముల హర్షిత బాబి, వైసిపి నాయకులు యమ్ ఉత్తమ్ కుమార్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనవి స్వార్థ రాజకీయాలు

ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-కనిగిరి : తెలుగుదేశం, జనసేన పార్టీలు స్వార్థ రాజకీయాలు, పదవి వ్యామోహం కోసం కలిసి వచ్చే ఎన్నికల్లో గెలవాలని కుట్రలు పన్నుతున్నారని రాష్ట్రంలోని ప్రజలు ఆకుట్రలను భగ్నం చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పట్టం కడతారని ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆదివారం కనిగిరి గార్లపేట రోడ్డులోని మోడల్ స్కూల్లో వద్ద జగనన్న కాలనీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు పనిచేసిన చంద్రబాబు నాయుడు ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. తెదేపా హయంలో ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఏ ఒక్కటి నెరవేర్చలేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని జనసేనని పవన్ కళ్యాణ్ నిలదీయడంలో వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దంతులూరి ప్రకాశం జెడ్పీటిసి కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, వైసీపీ నాయకులు రంగనాయకులరెడ్డి, మోహన్‌రెడ్డి, సంఘ సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, ఎస్వీఎస్ గోవర్ధన్‌రెడ్డి, ఇతర కౌన్సిలర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చప్టాలకు శాశ్వత పరిష్కారం చూపించండి

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఆలకూరపాడు టంగుటూరు మద్యలో ఉన్న మూడు చప్టాలు పొంగి పొర్లుతూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆలకూరపాడు నుండి టంగుటూరుకు నిత్యం వందలమంది ప్రయాణం కొనసాగిస్తుంటారు. ఒక మోస్తారు వర్షానికే చప్టాలు పొంగి ప్రవహిస్తుంటాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కారణంగా రాకపోకలకు ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వారు చొరవ తీసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

వివేకానంద విద్యా పీఠంలో చిల్డ్రన్స్ డ్యాన్స్

విశాలాంధ్ర-మార్కాపురం : స్థానిక వివేకానంద విద్యా పీఠంలో ఎన్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ స్టైల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చైల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వివేకానంద విద్యా పీఠం ఉత్తమ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూనే మరోవైపు విద్యార్థుల మానసిక పునరుత్తేజానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్య ఎంత అవసరమో అలాగే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అంతే అవసరమని ఆయన అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో వున్న సృజనాత్మకను, కళాతృష్ణను బయటకు తీసేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళీక్రిష్ణ, విద్యా పీఠం కరస్పాండెంట్ దేవతి చంద్రశేఖర్, కమిటీ సభ్యులు, వైసీపీ పట్టణ బొగ్గరపు శేషయ్య, జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కాసేట్టి నగేష్, కోశాధికారి బొంతల సుధాకర్‌రావు, బీజేపీ నాయకులు వాసవి డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్ తులసి స్వప్న, ఎన్‌కె కళా సాంస్కృతి ఫౌండేషన్ కమిటీ అధ్యక్షులు కె.నవీన్ కుమార్, సెక్రటరీ వై.వెంకట్, విద్యా పీఠం ప్రిన్సిపాల్ వై.రామ కోటయ్య, వైసీపీ నాయకులు కామిశెట్టి సురేష్‌లు పాల్గొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళి క్రిష్ణలు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

'జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లు'

అసంతృప్తిగా మిగిలి ఉన్న ఇళ్లవద్ద జనసైనికులు

విశాలాంధ్ర-యద్దనపూడి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరగనున్న జగనన్న ఇల్లు పేదల కన్నీళ్లు అనే ఉద్యమాన్ని మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు అయ్యప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్దాలతో పదవిని చేపట్టాడని, రాష్ట్రంలో 25 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి ఈరోజు హామీలను ఈ ప్రభుత్వం నిలుపుకోలేకపోయారని అన్నారు. టిడ్కో ఇల్లు జగనన్న కాలనీలపై ప్రభుత్వాని నిలదీయటానికి అధినేత పిలుపుమేరకు కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మండల అధ్యక్షుడు అయ్యప్ప మాట్లాడుతూ జగనన్న కాలనీలకు కనీస వసతులు కూడా ప్రభుత్వం కల్పించలేదని అన్నారు. చిమటవారిపాలెం, కటారి వారిపాలెం, యనమదల, యద్దనపూడి గ్రామాలల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మండల కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆచూకీ తెలపండి

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం ద్వారక చర్ల గ్రామానికి చెందిన బొద్దు రంగమ్మనే వృద్ధురాలు ఆచూకీ తెలపాలని పోలీసులు కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. గత నెల 30వ తేదీ ఉదయం నుంచి వృద్ధురాలు కనిపించడం లేదని రంగమ్మకు మతిస్థిమితం అంతంత మాత్రమే ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎవరికైన వృద్ధురాలి ఆచూకీ తెలిసి ఉన్న లేదా ఆమెను గుర్తించిన కోమరోలు పి.ఎస్ 9121102190, వృద్ధురాలి కుటుంబ సభ్యుల నంబర్లు 9907097439, 9179545232 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆచూకీ చెప్పిన వారికి తగిన బహుమానం ఇవ్వబడును అని ప్రకటించారు.

అంబేద్కర్‌కు నివాళి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్దదోర్నాలలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తన కుటుంబంతో శ్రీశైలం వెళ్లి దైవ దర్శనం చేసుకొని, అనంతరం తిరుగు ప్రయాణంలో ముందుగా స్థానిక నటరాజ్ సెంటర్లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పెద్ద దోర్నాల్లోని పున్నమి హోటల్లో శ్రీశైలం, దోర్నాల మండలాల మాల మహానాడు అధ్యక్షులు గంగుమాల విజయ్ బాబు ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు, సబ్ ప్లాన్లు గాని, ఎస్సీ కార్పొరేషన్లు గాని ఎలాంటి లబ్ధి చేకూర్చడం లేదని ఇప్పటికీ ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నారు అన్నారు. ఎలాంటి ఉపాధి లేక నిరుద్యోగులు అర్ధాకలితో అలమటిస్తున్నారని వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం తోడ్పాటు అందించాలన్నారు. ఇదే విధంగా ఉంటే 70 శాతం ఉన్న మాలలంతా కూడా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిచ్చయ్య, శ్రీకాంత్, రాజు, అజయ్, వినయ్, చందు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు తహశీల్దార్ పరామర్శ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఇటీవల కాలు నొప్పితో బాధపడుతూ ఉన్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, శాస్త్ర చికిత్స అనంతరం తన నివాసంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, విశ్రాంతి తీసుకుంటున్న, సందర్భంగా హైదరాబాదులోని తన నివాసంలో దోర్నాల మండలం తహశీల్దార్ ఏ వేణుగోపాలరావు, సీనియర్ అసిస్టెంట్, వి నాగేశ్వరరావులు మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి త్వరగా కోలుకోవాలని ఆక్షించారు.

ఘనంగా వన సమారాధనలు

విశాలాంధ్ర-చీరాల : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం పలుచోట్ల కార్తీక వన సమారాధనలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఈపురుపాలెం సావరపాలెం లోని శ్రీ సైకత లింగేశ్వర స్వామి వారి దేవస్థానం(రాజయ్య దిబ్బ) వద్ద ఆకురాతి వంశస్తుల వన సమారాధన సందడిగా జరిగాయి. ఉదయం ఈపురుపాలెం కూరగాయల మార్కెట్ వద్ద ఆకురాతి రంగనాయకుల స్వామి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం అలయంలో ప్రత్యేక పూజలను జరిపించారు. చీరాల ఎంపిటిసి సభ్యురాలు ఆకురాతి పద్మినిదేవి, మాజీ ఎంపీపీ దామర్ల శ్రీకృష్ణ, ఆకురాతి కోటేశ్వరరావు, ఆకురాతి మురళీకృష్ణ, ఆకురాతి నారాయణస్వామి, నాగేంద్రుడు, ఈపురుపాలెం, వేటపాలెం, తోటవారిపాలెం, కొత్తపేట, పేరాల, చీరాల, మంగళగిరి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆకురాతి వంశీయులు పాల్గొన్నారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి

పొందూరు గ్రామస్తుల డిమాండు

విశాలాంధ్ర-టంగుటూరు : పొందూరు-ఎం నిడమానూరు మధ్య ఉన్న మంగళ వాగు గట్టు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవాగు కొట్టుక పోయింది. దీనిగుండా పొందూరు టూ ఒంగోలు ఆర్టీసీ రాకపోకలు నిలిచిపోయాయి. దీనివల్ల పొందూరు ప్రజల్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలేజీలకు వెళ్లే విద్యార్థులు మరియు షాప్స్ అండ్ జాబ్స్‌కీ వెళ్లే బయటకి వెళ్లే రైతులు పొగమొక్కలకీ వెళ్లే వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు. అనేక సార్లూ అధికారులకు విన్నవించనను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులు రాకపోకలు పునరుద్ధరించి పొందూరు - నిడమానూరు మధ్య ఉన్న మంగళవాగు మీద హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులను కోరుతున్నారు.

కార్తీక సేవాపురస్కారం

విశాలాంధ్ర-రాచర్ల : రాష్ట్ర బ్రాహ్మణ సంఘం పచ్చిమగోదావరి జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల సంతాన వేణుగోపాలస్వామి ఆవరణములో వేద పాఠశాల నందు కార్తీక వనసమారాధన ఆత్మీయ సమ్మేళనము నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కరొనసమయంలో సేవచేసినటువంటి బ్రాహ్మణులందరికీ ఘనంగా సత్కరించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో చేసిన కార్తీక మాసంలో చేసిన రుద్ర పూజలు నిర్వహిస్తున్నందుకు వేదపాఠశాలకు, గోషాలకు చేసిన సేవలకు పశ్చిమగోదావరి జిల్లా బ్రాహ్మణ సంఘం వారు కార్తీక సేవారత్న పురస్కారాలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులును ముందుగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అనంతరం అఖిల భారత బ్రాహ్మన సంఘం ఉపాధ్యక్షులు సూరంపూడి కామేష్, సినీ హాస్యనటులుహాస్య బ్రహ్మ సూరంపూడి గుండు సుదర్శన్, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సాంస్కృతిక చైర్మన్ బుచ్చిబాబు మిమిక్రీ ఆర్టిస్టు అయిన పెద్దల చేతుల మీదుగా వందల మంది వేద పండితులచే వేదమంత్రోచ్చారణ మధ్య ఘనంగా సత్కారం పొందారు. సన్మానం చేసినందుకు బ్రాహ్మణ సంఘానికి బి యస్ నారాయణరెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

జాతీయ వారోత్సవాల్లో పోటీలు

విశాలాంధ్ర-చీరాల : గ్రంథాలయాలని సమాజానికి దగ్గర చేసేందుకే ప్రతీయేటా నవంబర్ పద్నాలుగు నుండీ ఇరవై వరకూ జాతీయ స్థాయిలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చీరాల గ్రంధపాలకురాలు డి ధనమ్మ అన్నారు. ఆదివారం చీరాల శాఖ గ్రంధాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు ధనమ్మ మాట్లాడుతూ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చీరాల లైబ్రరీలో సోమవారం ప్రకృతి అనే అంశంపై చిత్ర లేఖనం పోటీలు మంగళవారం ఇంటర్, డిగ్రీ విద్యార్థుల స్వాతంత్ర సమరయోధుడు అనే అంశంపై వ్యాస రచన, బుధవారం గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత అంశంపై వక్తృత్వపోటీలు గురువారం దేశభక్తి గీతాలు, శుక్రవారం ఆటల పోటీలు మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలకు స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ఇరవైవ తేదీన జరిగే ముగింపు సభలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా విలువైన బహుమతులు ఇస్తామని పూర్తి వివరాలకు గ్రంథ పాలకురాలు చరవాణీ నంబర్ 9949124177ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ కే దాస్ ఉపాధ్యాయులు పవని భానుచంద్ర, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయం అభివృద్ధికి రూ.10వేల అందజేత

విశాలాంధ్ర-రాచర్ల : రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామానికి చెందిన చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్‌కు తిమ్మాపురం గ్రామానికి చెందిన రెడ్డిబోయిన పెద్దయ్య మాజీ సర్పంచ్ వారి తల్లిదండ్రులు రెడ్డి బోయిన కొండయ్య నాగమ్మ జ్ఞాపకార్థం రాచర్ల మండలం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అభివృద్ధి కోసం పదివేల రూపాయలు శ్రీకాంత్‌కు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన రెడ్డిబోయిన పెద్దయ్యకు చిన్ని సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ 10 వేలు ఆర్థిక సహాయాన్ని పాఠశాల అభివృద్ధికి ఉపయోగిస్తామని శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మాపురం మాజీ సర్పంచ్ పెద్దయ్య మాట్లాడుతూ చిన్న వయస్సులో మాగులూరి శ్రీకాంత్ చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటిని ఏర్పాటు చేసి గిద్దలూరు నియోజకవర్గంలో గత 8 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు స్టడిమెటీరియల్ పంపిణీ చేయడం అక్షరాస్యతను పెంచెందుకు కృషి చేయడం మైదలైన సేవా కార్యక్రమాలు అభినందనీయమని చిన్ని సేవాసంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశ సమైక్యత

\- దేవరపల్లి రంగారావు

విశాలాంధ్ర-చీరాల : కాంగ్రెస్ పార్టీతోనే దేశ ప్రగతి సాధ్యమని, అన్ని వర్గాల ప్రజల మనోభావాలను కాపాడుతూ దేశ సౌభ్రాతత్వంను, సెక్యులర్ విధానాలను, దేశ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాలించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి రంగారావు అన్నారు. సోమవారం అంబేద్కర్ భవన్లో చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమీక్ష, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవరపల్లి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనలో రంగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం దిశగా ముందుకు తీసికొనివెళ్లే విధంగా బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గంటా అంజిబాబు సారధ్యంలో చీరాల కాంగ్రెస్ పార్టీకి జీవం పోసేందుకు అడుగులు వేస్తున్నామని, పార్టీని బలోపేతం చేసేందుకు నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులను, పార్టీ అభిమానులు, పార్టీ సీనియర్ నేతలను కలుపుకొని ముందుకు వెళ్తామని అన్నారు. సభ్యత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కేంద్ర మంత్రి జేడి శీలం, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గంటా అంజిబాబు, బాపట్ల ఇంచార్జి దోనెపూడి దేవరాజు, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బి చార్లెస్ ప్రదీప్ (బన్నీ)లు హాజరవుతారని,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరపల్లి రంగారావు కోరారు.

ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషను కలసిన తాళ్లూరు నేతలు

విశాలాంధ్ర-తాళ్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర మైనార్టీ శాఖ మాత్యులు మహమ్మద్ అంజాద్ భాషను ఆదివారం తాళ్లూరు మండల వైసీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. దర్శి నియోజకవర్గంలోని కురిచేడు నందు మస్జిద్ ఏ నూరాని నూతన మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అంజాద్ భాషను దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరులు తాళ్లూరు మండల వైసీపీ ఇన్చార్జ్ మద్దిశెట్టి రవీంద్ర, తాళ్లూరు జెడ్పిటిసి మారం వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, దర్శి నగర పంచాయతీ సభ్యులు విసి రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష, తాళ్లూరు వైసిపి ఇన్చార్జ్ మద్దిశెట్టి రవీంద్రలను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం సర్పంచ్ ఎస్.కె. కాలేషా వలి, ఇతర మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక జనరల్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఒంగోలుకు చెందిన శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎస్సై బి నరసింహారావు తూర్పు గంగవరం గ్రామానికి చెందిన ఎక్సైజ్ శాఖ సిఐ సోమ ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం ఎస్సై నరసింహారావు మాట్లాడుతూ వ్యాపార దృక్పథంతో చూసే ఈ రోజుల్లో సేవా దృక్పథంతో పనిచేయడం గొప్ప విషయమని, ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఆలోచనతో ఒక మల్టీ స్పెషాలిటీ వైద్యశాలను నిర్వహిస్తూనే శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని అన్నారు. వైద్యశాలకు చెందిన వైద్య బృందం డాక్టర్ చాపల శాంత కుమారి ,డాక్టర్ నాగిరి కుమార వర్మ, డాక్టర్ సానల ధీరజ్ బాబు, డాక్టర్ సున్నపు విజయ కుమార్, డాక్టర్ సున్నపు నవీన్, డాక్టర్ పి ఏడుకొండలు తదితరులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, బిపి, షుగర్, ఈసీజీ, పల్స్ ఆక్సీ మీటర్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య బృందం యస్ఐ నరసింహారావు, ఎక్సైజ్ సీఐ సోమ ఆంజనేయులు, ఈ వైద్య శిబిరానికి సహకరించిన మీసేవ నిర్వాహకులు సోమ సుబ్బారావు, సోమ ప్రసాద్‌లకు శాలువా కప్పి మెమొ ంటోలతో సన్మానించారు. అనంతరం గ్రామానికి చెందిన సోమ సోదరులు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల అధినేత సీనియర్ వైద్యులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చేపల శాంత కుమారి లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సాహిత్యం, కళలు పెంపొందించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : భారతీయ సంస్కృతి, సాహిత్యం, కళలు ప్రజలకు విస్తృతంగా చేర్చి, భారతీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని మన సంస్కృతి గౌరవ అధ్యక్షులు డాక్టర్ మన్నే రవీంద్ర పిలుపునిచ్చారు. యర్రగొండపాలెం పట్టణం నందు నూతనంగా ఏర్పాటైన మన సంస్కృతి సాహితీ ట్రస్టు రెండవ సమావేశం స్థానిక ఆదిత్య విద్యాసంస్థల కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సంస్థను విజయదశమి పర్వ దినమున ఏర్పాటు చేయడమైనది. మన సంస్కృతి అధ్యక్షులు మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మన్నే రవీంద్ర మాట్లాడుతూ ఇందులో భాగంగా ప్రతి నెల ఒక కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ మన సంస్కృతి కార్యదర్శి సూర్య రమేష్, నంద్యాల పార్థసారథి, మాదాల వీరప్పారావు, ఎక్కలి బాల వెంకటేశ్వర్లు, పుచ్చనూతల లక్ష్మీనారాయణలతో పాటు పలువురు సభ్యులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

19న జగనన్న దళితసేనాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : ఈ నెల 19న శనివారం ఉదయం 10 గంటలకు మార్కాపురం పట్టణంలోని ఎస్సీబీసీ కాలనీలో గల డ్వాక్రా బజార్ నందు జగనన్న దళిత సేన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని 16 బ్లాక్ కౌన్సిలర్ హర్షిత బాబి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం శాసనసభ్యులు కుందూరు నాగార్జునరెడ్డి పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని బాపూజీ కాలనీలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగనన్న దళితసేన నాయకులు భూదాల సతీష్, చెన్నకేశవులు, రెడ్డి పోగు చిన్న గురవయ్య, పవన్, 16 బ్లాక్ ఎస్సీ నాయకులు తప్పెట్ల చెన్నకేశవులు, జానీ, బాబు, నూతలపాడు చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - కనిగిరి : మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరానికి కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వృద్ధులు భారీగా తరలివచ్చారు. ఉగ్ర నరసింహారెడ్డి వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జనని చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో జరిగిన కంటి వైద్య పరీక్షల్లో 943 మంది వృద్ధులను పరీక్షించగా అందులో 410 మందికి కంటి ఆపరేషన్లకు అవసరమని వైద్యులు సూచించారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన 410 మంది వృద్ధులను ప్రత్యేక వాహనంలో పెద్దకాకాని శంకర కంటి ఆసుపత్రికి విడుదలవారీగా తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం 130 మందిని, 16వ తేదీ మధ్యాహ్నాం 70 మందిని, 17వ తేదీ ఉదయం 90 మందిని ,18వ తేదీ మధ్యాహ్నాం 120 మందిని శస్త్ర చికిత్సకు తరలిస్తున్నట్లు తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు అనీష్ దృశ్య వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది రోగులు పరీక్షించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వృద్ధులకు ఉగ్ర భోజన వసతి కల్పించడంతో పాటు టిడిపి నాయకులు, మహిళలు, ఐ టిడిపి కోఆర్డినేటర్లు తెలుగు యువత నాయకులు వాలంటీర్లుగా వ్యవహరించారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

రూ.50వేలు అందజేసిన 'ఫాతిమా'

విశాలాంధ్ర-గిద్దలూరు : ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో నివసిస్తున్న పోతుగంటి దర్గమ్మ మొదటి కుమార్తె ఖాదర్ బీ వివాహానికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఆ కుటుంబ సభ్యులకు తగిన ఆర్థిక స్తోమత లేక ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థకు విన్న వించుకున్నారు. ఖాదర్‌బికి పెళ్లి కానుక రూ.50 వేలు ఇస్తామని మా నీఖా రోజు ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాసింవలి తక్షణమే స్పందించి గ్రూపు సభ్యుల సహకారంతో ఫాతిమా ట్రస్ట్ ద్వారా రూ.45వేలు, నాలుగు చీరలు, ఒక డిన్నర్ సెట్ ఆర్థిక సహాయం అమ్మాయి ఇంటికి వెళ్లి స్వయంగా ఇవ్వడమైనది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాసిం వలి మాట్లాడుతూ ఇప్పటికి 11మంది వివాహలకు ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థ సాయం చేయడం జరిగినదని, అలాగే మా సంస్థ నిరంతరము అనాధలకు నిరుపేదలకు సహాయం చేస్తూనే ఉంటుందని తెలియజేశారు. పేదలకు అండగా ఉండి ఆపదలో తోడుంటూ తగిన చేయూతను అందిస్తామని తెలియజేశారు.

జగనన్న కాలనీల స్థలాల పరిశీలన

గంగవరంలో జగనన్న కాలనీ స్థలాలను పరిశీలిస్తున్న వరి కూటి నాగరాజు తదితరులు

విశాలాంధ్ర-తాళ్లూరు : జగనన్న కాలనీల పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించడానికి జగనన్న కాలనీల కొరకు ఏర్పాటు చేసిన స్థలాలను, కాలనీల నిర్మాణాలను పరిశీలిస్తున్నట్లు జనసేన ప్రకాశం జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి వరి కూటి నాగరాజు అన్నారు. తాళ్లూరు మండలం లోని పలు గ్రామాలలో ఆదివారం జగనన్న కాలనీల నిర్మాణాలను, స్థలాలను జనసేన యువ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా తూర్పు గంగవరం గ్రామంలో కేటాయించిన స్థలాలను పరిశీలించి వరి కూటి నాగరాజు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో జగనన్న కాలనీలలో జరుగుతున్న మోసాలను, అవకతవకలను గుర్తించి పార్టీ అధిష్టానానికి తెలియజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. నిరుపేదలకు న్యాయం చేస్తున్నామనే నెపంతో జగనన్న కాలనీల ద్వారా జరుగుతున్న మోసాలను ప్రజలకు వివరించి వారిలో అవగాహన కలిగించడానికి ఇలాంటి పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు ఎస్.కె యిర్షాద్, తాళ్లూరు మండల జనసేన నాయకులు తోట అయ్యప్ప, చిరంజీవి పాల్గొన్నారు.

గుంటి గంగ దేవాలయ ఆదాయం రూ.12,230

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలో గల గుంటి గంగ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని నైవేద్యాలతో అమ్మవారి ముక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుండే ఆలయ పూజారిని విజయలక్ష్మి గుంటి గంగ మూల విరాట్ ను పట్టు వస్త్రాలతో, పూలమాలలతో, బంగారు, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించారు. తదనంతరం భక్తుల కోలాహలం మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ కటకం శెట్టి శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ జేఏపి నాగేశ్వరరావు దేవాలయంలో ఉండి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. 419 దర్శనం టికెట్లు, 12 వాహన పూజలు జరిగాయని, అమ్మవారికి భక్తులు 8,161 విరాళాలు, 2 కేశఖండన, అమ్మవారికి 21 చీరలు అందించారని, ఆదివారం ఒక్కరోజు 12,230 రూపాయలు ఆదాయం లభించినట్లు దేవదాయ శాఖ అటెండర్ జె శ్రీనివాసరావు తెలిపారు .భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది, దేవాలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : మార్కాపురం మండలంలోని కపిలగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నందు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు రంగస్వామి గౌడ్ నేతృత్వంలో ఆ సంఘ సభ్యులు ఐక్యంగా కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వనభోజనం మహోత్సవానికి ముఖ్య అతిథులుగా భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ హాజరై భక్తులకు ఉపన్యాసాన్ని అందించారు. ముందుగా కొండపై వెలసిన కపిలగిరి లక్ష్మీనరసింహస్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. అదేవిధంగా చిన్నారులకు మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన సభలో కమలానంద భారతి స్వామీజీ భక్తులకు జీవితం పై పలు అంశాలను ఉపన్యసించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు రంగస్వామి గౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నామని, అందరం ఐక్యతగా కలిసిమెలిసి ఉండేందుకు ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం నిర్వహించమని అన్నారు. అనంతరం భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ కార్తీక వనభోజనం మహోత్సవంలో గౌడ సంఘం నాయకులు కృష?య్య గౌడ్, నరసింహారావు గౌడ్, పిచ్చయ్య గౌడ్‌లతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న వితరణ స్వీకరించారు.

ఘనంగా కార్తీక మాస వన సమారాధన

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక మామిడిపాలెం కృష్ణ మందిరం వద్ద మామిడిపాలెం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రధమ కార్తీక మాస వన సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, మహన్యసపూర్వక రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం తదితర పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారి కృపాకటాక్షాలు సిద్ధించాలని ప్రత్యేక పూజలు మామిడిపాలెం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమానికి నగరంలోని ప్రజలందరూ సామూహిక వనభోజన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన నగరవాసులందరికీ మామిడిపాలెం నగర అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో మామిడిపాలెం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమం నిర్వహణ ఒంగోలు మామిడిపాలెం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలియజేశారు.

శివాలయాన్ని సందర్శించిన జాయింట్ కమిషనర్

విశాలాంధ్ర-పెదకాకాని: మండల కేంద్ర మైన పెదకాకాలోని శివాలయాన్ని ఆది వారం దేవాలయ శాఖ జాయింట్ కమిష నర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ దంప తులు సందర్శించారు. వీరికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఆజాద్ దంప తులు స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రజాధనం వృధా చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-పొన్నూరు: పట్ట ణంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీలను ఆదివారం జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం తమ అధినేత పవన్ కళ్యాణ్‌పై, జనసేన నాయకులపై అక్రమ కేసులు బనాయించడం వల్ల తాము భయపడి వెనక్కి తగ్గబోమన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలను రంగులు మార్చి ప్రజాధనం వృధా చేసి తానే అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకోవడం దారుణం అన్నారు. కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనలో విఫలమ య్యారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జగనన్న కాలనీలో జగనన్న మోసం అనే పేరు పెట్టాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లూరి అప్పారావు, దేశంశెట్టిశెట్టి సూర్య, పొన్నూరు రూరల్ మండల అధ్యక్షుడు నాగిసెట్టి సుబ్బారావు, పొన్నూరు టౌన్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ ట్రెండ్స్ నూతన స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : అప్పారెల్, ఫుట్‌వేర్, యాక్సెసరీస్ ప్రత్యేక చైన్ రిలయన్స్ ట్రెండ్స్ గుంటూరు గుజ్జనగుండ్ల ప్రాంతంలో తమ 5వ నూతన స్టోర్‌ని ప్రారం భించిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. 17896 అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉందని చెప్పారు. గుంటూరు ప్రాంత వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటు ధరలను కలిగి ఉందని, ఆధునిక ఉమెన్స్ వేర్, మేన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్సెసరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురుచూడవచ్చన్నారు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3499 షాపింగ్ చేస్తే రూ.199కి ఆకర్షణీయమైన బహుమతి పొందవచ్చన్నారు. రూ.2999 కొనుగోలుపై వినియోగదారులు రూ.3000 విలువగల కూపన్లు పూర్తి ఉచితంగా పొందగలుగుతారని వెల్లడించారు.

అసత్య ప్రచారాలను అడ్డుకోండి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

విశాలాంధ్ర - శింగరాయకొండ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని టిడిపి, జనసేన నేతలు అసత్య ప్రచారాలను ప్రారంభించారని, ఈఅసత్య ప్రచారాలను అడ్డుకోవాల్సిన బాధ్యత వైసిపి సైనికులకు ప్రతి ఒక్కరికీ ఉందని కొండెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపించి, ప్రజలు బలపరిచేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఊళ్ళపాలెం రోడ్డులో ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీ మెగా లేఅవుట్‌ను పరిశీలించిన వరికూటి అనంతరం అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాలు అందని వారు, అర్హులు కాని వారి వద్ద జనసైనికులు వెళ్ళి దుష్ప్రచారానికి తెరతీశారన్నారు. జనసేన చేస్తున్నది దుష్ప్రచారం అన్నది అందరూ తెలుసుకోవాలన్నారు. అర్హులయిన ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమం అందించిందన్నారు. ఎక్కడైనా ఒకరిద్దరికి అందకపోతే చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 2014 నుండి 19 వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్ని ఇళ్ళు ఇచ్చారో, ఎన్ని పట్టాలు ఇచ్చారో చెప్పాలంటూ వరికూటి ప్రశ్నించారు. ప్యాకేజీ స్టార్ మోసగాళ్ళయిన తెలుగుదేశం నేతలతో కలిసి దుష్ప్రచారం చేయడానికి నడుం బిగించారన్నారు. జరిగిన అభివృద్ధిని ప్రజలకు కళ్ళకు గట్టినట్లు చూపడానికి వైసిపి నేతలు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి వరకు వారు ప్రశ్నించారని, ఇపుడు తాము రంగంలోకి దిగి గతంలో వారేమి చేశారో, ఇపుడు మేం ఏమి చేశామో చెప్పడానికి సిద్ధమయ్యామన్నారు. అసత్య ప్రచారాలను అడ్డుకోవడమే ప్రణాళికగా ఇక ముందుకు వెళతామన్నారు. ఈవిలేకరుల సమావేశంలో వైద్యవిభాగం అధ్యక్షులు అశోకుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిబాబు, దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, సోమరాజుపల్లి వైస్‌ప్రెసిడెంట్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

15న ఎస్సీ,ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్ సెల్

బాధితులకు దళిత నేత నీలం విజ్ఞప్తి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నీలం

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 15వ తేదీన జిల్లా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఒంగోలులో జరుగు యస్.సి,యస్.టి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ సద్వినియోగం చేసుకోవాలని యస్.సి,యస్.టి బాధితులకు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రంరావు విజ్ఞప్తి చేశారు ఆదివారం మార్కాపురం పంచాయతీరాజ్ అతిథి గృహమునందు విలేకరులతో మాట్లాడారు ఈ నెల 15వ తేదీన మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో దళిత సంఘాల డిమాండ్ మేరకు జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్‌యస్.సి,యస్.టి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నా నన్నారు. యస్.సి,యస్.టి ఫిర్యాదులు చేసిన కేసులు కట్టని వారు ఈ గ్రీవెన్స్ సెల్ కు హాజరై వారి ఫిర్యాదులను జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు అలాగే యస్.సి,యస్.టి కేసులు కట్టిన విచారణ పేరుతో డిఎస్పీలు ఫాల్స్ గా రిఫర్ చేసిన బాధితులు కూడా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు అలాగే యస్.సి,యస్.టి కేసులు నమోదైన ముద్దాయిలు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని కేసులలో కూడా హైకోర్టులో కౌంటర్ వెయ్యని ఘటనపై కూడా జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు ఇంకా భూ సంబంధిత కేసులలో యస్.సి,యస్.టి లు ఫిర్యాదు చేసిన కేసులు కట్టని సంబంధిత కూడా ప్రత్యేకంగా కేసు కోసం ఫిర్యాదు చేయవచ్చు అని చెప్పారు డి.ఎస్.పి లు కోర్టులో వేసిన చార్జ్ షీట్లలో కూడా లోపాలు ఉన్నట్లయితే మరియు ముద్దాయిలల్లో కొంతమందిని తీసివేసి ముద్దాయిలకు అనుకూలంగా ఛార్జ్ షీట్ వేసిన ఎస్ఐలపై కూడా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు యస్.సి,యస్.టిలు ఫిర్యాదు చేసినప్పుడు ఎటువంటి విచరణ జరపకుండానే డి.ఎస్.పి,ఎస్.పి అనుమతి లేకుండానే యస్.సి,యస్.టి కేసు నమోదు చట్ట ప్రకారం చేయవలసినది అన్నారు,కానీ మార్కాపురం డివిజన్ లో ఎక్కువగా యస్.సి,యస్.టి ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు అన్నారు డి.ఎస్.పి అనుమతి లేనిదే యస్.సి,యస్.టి కేసు కట్టమంటూ ఎస్.ఐలు కాలయాపన చేస్తున్నారు అన్నారు కొన్నిచోట్ల కొంతమంది ఎస్సైలు వీడియో ఆధారాలు ఉన్నా కూడా యస్.సి,యస్.టి కేసులు కట్టడం లేదన్నారు మరికొన్నిచోట్ల వీడియో ఆధారాలు ఉన్నా కూడా డిఎస్పీలు యస్.సి,యస్.టి కేసులను ఫాల్స్ గా చేస్తున్నారన్నారు మరి కొంతమంది వైఎస్ఆర్ పార్టీ నాయకుల కనుసైగలల్లో యస్.సి,యస్.టి బాధితులపై కౌంటర్ కేసులు పెడుతున్నారన్నారు మరి కొంతమంది డిఎస్పీలు సకాలంలో బాధితుల లిస్టు కార్యాలయంకు పంపించడం లేదు అన్నారు కావున యస్.సి,యస్.టి కేసుల ఫిర్యాదు దారులు ఎవరైనా తమకి ఎటువంటి పోలీసు అధికారుల నుండి ఎటువంటి అన్యాయం జరిగిన కేసులు కట్టని వాళ్ళు ఫాల్స్ కేసులుగా తీసివేసిన వాళ్ళు తదితరులు అందరూ ఈ నెల 15వ తేదీన జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉదయం 10 గంట నుండి మధ్యాహ్నం 2 గంటల జరిగే యస్.సి,యస్.టి స్పెషల్ గ్రీవెన్స్ సెల్ కు హాజరై తమ యస్.సి,యస్.టి కేసులను పరిష్కరించుకో వలసిందిగా దళిత నేత నీలం నాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ధార అంజయ్య,జనుమాల నాగయ్య,మాలపోలు శాంతకుమార్, కంకణాల నాగరాజు,ఆగమన రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక, పేదల సమస్యలపై 'కాంతారావు' నిరంతర పోరు

సీహెచ్ఎల్ కాంతారావును సన్మానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, జంగాల అజయ్‌కుమార్, మారుతివరప్రసాద్ తదితరులు(ఫైల్)

విశాలాంధ్ర-నరసరావుపేట : ఖమ్మం జిల్లా మధిర మండలం ఇల్లందులో పాడు గ్రామంలో చెరుకూరి లింగయ్య, పార్వతమ్మ దంపతులకు 1931వ సంవత్సరంలో జన్మించిన కాంతారావు మధిరలో ప్రాథమిక విద్య, హైదరాబాదులో కళాశాల విద్య, మద్రాసులో న్యాయ విద్యను పూర్తి చేశారు. తాను చదువుకుంటున్న రోజుల్లోనే తెలంగాణలో వామపక్షాల ఆధ్వర్యంలో రజాకార్లకు వ్యతిరేకంగా ఉధృతంగా కొనసాగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొంటున్న నాటితరం నాయకులు రావి నారాయణరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, నల్లమల, చంద్రా రాజేశ్వరరావు, నల్లమల గిరి ప్రసాద్‌లను దగ్గరగా చూసి, వారి సాహిత్యంతో కాంతారావు భారత కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారు. రొంపిచర్ల మండల ముత్తన్నపల్లి గ్రామానికి చెందిన అభయ ప్రదంభతో వివాహం జరగటంతో 1960వ సంవత్సరంలో నరసరావుపేటలో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. అప్పట్లో నరసరావుపేట నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, ఆయన సోదరుడు కాసు వెంగళ రెడ్డి పెత్తనంలో నరసరావుపేట తాలూకా కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా ఉండేది. ప్రభుత్వాన్ని, నాయకులను సమస్యలపై ప్రశ్నిస్తే అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపే వారు. నరసరావుపేట తాలూకాలోని నాటితరం నాయకులు పోపూరి బ్రహ్మానందం, మందపాటి నాగిరెడ్డి, గంగినేని వెంకటేశ్వర్లు, ఖాసిం ఖాన్, షేక్ బుడే, కరణం రంగారావు, దర్శి లక్ష్మయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, శాస్త్రి, చెంచయ్య, దామచర్ల అప్పయ్య, కొమర వీరస్వామిలతో కలిసి పల్నాడు ప్రాంతంలో ప్రజల సమస్యలపై ఒకపక్క పోరాటాలు చేస్తూ, సీపీఐ బలోపేతానికి కృషి చేశారు. పార్టీ శ్రేణులపై నమోదయ్యే కేసులను స్వయంగా వాదించి, వీలైనంత త్వరగా బెయిల్ తెప్పించటం, పోలీసులతో మాట్లాడి కేసులు లేకుండా రాజీలు చేయటం లాంటి కార్యక్రమాల్లో కాంతారావు విశ్రాంతి లేకుండా పనిచేసేవారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా రైస్ మిల్లు, ఆర్టీసీ, విద్యుత్, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనిట్లను ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి కృషి చేశారు. నాగార్జునసాగర్ కెనాల్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా యూనియన్ అధ్యక్షులు అవ్వారి భావన్నారాయణ, తోట పిచ్చయ్యతో కలిసి సుమారు పన్నెండు వందల మంది తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని హైకోర్టులో రిట్ వేసి పర్మినెంట్ చేయించారు. పార్టీ శ్రేణులకు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందించేవారు. పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. నరసరావుపేటలో పెద్ద చెరువుగా చెప్పబడే లెనిన్ నగర్ ఏర్పాటు, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో ముఖ్య పాత్ర వహించారు. పల్నాడులో బంజరు భూముల పంపిణీ, ఇళ్ల స్థలాలు, నాగార్జునసాగర్ సాగునీరు ఎగువ పొలాలకు పంపిణీ చేసే విధంగా అధికారులపై రైతులతో కలిసి పోరాటాలు చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకునేందుకు గోడలను పగలగొట్టి రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కోస్టల్ కమిటీలో ప్రధాన భూమిక పోషించారు. పట్టణ పరిధిలోని ఎస్ఆర్‌కె కాలనీ, శివప్రసాద్ రావు కాలనీ, ఎస్టీ, ఎస్సీ, బీసీ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. నరసరావుపేట తాలూకాలో విద్యాభివృద్ధికి కొత్త రఘురామయ్య కాలేజీ, చిలకలూరిపేటలో సాధినేని చౌదరయ్య కాలేజీలో ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించారు. సంతమాగులూరులో హైస్కూల్ ఏర్పాటు చేశారు. 90 ఏళ్ల వయసు పైబడిన పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నేటితరం నాయకులకు సూచనలు, సలహాలను అందించడమే కాక పార్టీ శ్రేణులకు ఉచితంగా న్యాయ సహాయం అందజేసే వారు. ఇటీవల ఆయన తన మనోభావాలను విశాలాంధ్రతో పంచుకుంటూ నాయకులు ప్రజల్లోంచి రావాలని, ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాల ద్వారా ప్రజాసమస్యలు పరిష్కరించాలని నేటితరం నాయకులకు సూచించారు.

అభ్యుదయ, భావయువ కవి వశిష్ట సోమేపల్లి

విశాలాంధ్ర-గుంటూరు : ముప్పయి వసంతాల నవ యువకుడు తన రచనల ద్వారా తెలుగు సాహిత్య లోకాన్ని కొత్త పుంతలు తొక్కిస్తూ వర్తమాన సాహితీ వేత్తలకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాడని ప్రముఖ కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత సోమేపల్లి వెంకటసుబ్బయ్య కుమారుడు శ్రీ వశిష్ట సోమేపల్లి వ్రాసిన 'ఆకురాలిన చప్పుడు' పుస్తక ఆవిష్కరణ సభ స్థానిక లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించి శ్రీ వశిష్ట అమ్మమ్మ సౌభాగ్యమ్మకు అంద జేసిన అనంతరం ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ ప్రకృతి, రైతుల ఆక్రందన, అబలలపై అత్యాచారాలు, విధ్వంసం, వలస కూలీలు వంటి కవితలు ద్వారా తన మొదటి ప్రచురణ ద్వారా తనలోని సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించాడని చెప్పారు. తెలుగు సాహిత్య చరిత్రలో తన సంతకాన్ని సుస్థాపితం చేసుకోవాలని, కేంద్ర సాహిత్య యువ పురస్కారం కూడా అందుకోవాలని ఆశీర్వదించారు. సభకు అధ్యక్షత వహించిన అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక కంటిలో అగ్ని మరొక కంటిలో అశ్రువులు కవికి ఉండాల్సిన లక్షణాలన్నారు. సాహిత్య శిల్పి వెంకట సుబ్బయ్య వారసునిగా శ్రీ వశిష్ట ఉన్నత సాహిత్య పీఠం అధిరోహించాలని ఆకాంక్షించారు. సాహితీ వేత్తలు చలపాక ప్రకాష్, అనిల్ డ్యాని, మందరపు హైమావతిలు పుస్తకాన్ని విశ్లేషించారు. సభకు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం సుభాని స్వాగతం పలుకగా సాహితివేత్తలు రావెల సాంబశివరావు, డాక్టర్ విజయ్ కోగంటి, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, నానా తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వీవీఐటీ బాలోత్సవ్-2022

విశాలాంధ్ర-గుంటూరు : ప్రపంచ తెలుగు బాలల పండుగ 'వీవీఐటీ బాలోత్సవ్-2022' వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో చిన్నారుల కేరింతలతో రెండవ రోజు కోలాహలంగా సాగాయి. పెద్ద మొత్తంలో సందర్శకులు హాజరు కావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 280 పాఠశాలల నుంచి 4000 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద సందడి సాగాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 54 నాటికలు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. సమాజానికి హితవు పలికే విధంగా విద్యార్థుల ప్రదర్శించిన నాటికలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మక తను వెలికితీసాయి. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అనుభవాల మార్పిడి కొత్తదనం నేర్పించటానికి ఉపయోగపడేలా న్యాయనిర్ణేతలు ప్రత్యేక బోధనలు చేసారు. వాద్య సంగీతంలోని రాగ ప్రధానం, తాళ ప్రధానం, ఆహుతులను ఆకట్టుకున్నాయి. రెండవ రోజు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్థిక కారణాల వలన మానవ సంబంధాలు ఏవిధంగా దెబ్బతింటున్నాయో తెలియచేస్తూ పిన్నమనేని మృత్యుంజయరావు రచించిన 'ఆస్తికలు' నాటిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామం మాజీ వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి కోటేశ్వరరావు ఇంటి దగ్గర ఉన్న తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, బడుగు బలహీన, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి, నటసార్వభౌమ, యుగపురుషుడు అన్న ఎన్టీఆర్ విగ్రహంపై రాత్రి గుర్తుతెలియని దుండగులు బూట్లు పెట్టారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉప్పలపాడు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు వలివేటి మురళి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ విగ్రహాలను పగలగొట్టడం, విగ్రహాలపై చెప్పుల దండలు వేయటం తదితర చర్యలు ఎక్కువగా జరుగుతున్నాయని ఇలాంటి పనులు చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ధర్నా చేశారు. దుండగులను వెంటనే అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, బంద్‌లకు పిలుపునివ్వడం జరుగుతుందని తెలిపారు.

జగనన్న కాలనీ సందర్శించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 'జగనన్న ఇల్లు-పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు-పశ్చిమ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గ లబ్దిదారులకు పేరేచర్లలో కేటాయించిన జగనన్న కాలనీలో ఉన్న ప్లాట్స్‌పై జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ఆదివారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద భారీ జగనన్న కాలనీగా దీనిని ఏర్పాటు చేశారని, దీనిలో అధికార ప్రభుత్వం వందల కోట్లు దోపిడీ చేసిందనడానికి నిదర్శనంగా కనబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడపా మాణిక్యాలరావు, నారదాసు రామచంద్ర ప్రసాద్, కొర్రపాటి నాగేశ్వరరావు, చట్టాల త్రినాథ్, బంధానందం జ్యోతి, విజయ్, గుగ్గిళ్ల సురేష్, నాగబాబు, ప్రసన్న నాయక్, తన్నీరు గంగరాజు, కోడిగంటి రవి, మహంకాళి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జల జీవన మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా కల్పిస్తున్న తాగు నీటి సరఫరా సదుపా యాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కోరారు. స్థానిక కోనేరు తాగు నీరు చెరువు వద్ద ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పథకానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. తాడికొండ నియోజకవర్గానికి రు.16కోట్ల 38లక్షల రూపాయలు మంజూరయ్యాయని, ఫిరంగిపురం మండలంలో 11గ్రామాలకు రు.4కోట్ల 30లక్షలు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఈ వ్యయంతో మండలంలో 4వేల 950కు పైగా కుళాయి పంపులు వేశామని 2024 సంవత్సరానికి కుళాయి పంపులు పనులు పూర్తవుతా యన్నారు. అనంతరం కోనేరు చెరువును పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్దుల్ గఫార్ ఉన్నారు.

వినికిడి సమస్యలపై చైతన్యం అవసరం

విశాలాంధ్ర-గుంటూరు : రెండు నుంచి మూడేళ్లలోపు పిల్లల శారీరక, మానసిక ఎదు గుదలను తల్లిదండ్రులు గమ నించకపోతే వారి నూరేళ్ల జీవితం అవస్థలపాలు చేసిన వారవుతారని స్పీచ్ తెరపిస్ట్, మై వాయిస్ మల్టీ రిహాబిలిటేషన్ నిర్వాహకులు రెబ్బ మోహన్ కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేట భగత్ సింగ్ బొమ్మ వద్ద గల సాయి స్వర్ణ కాంప్లెక్స్‌లో వారం రోజులు పాటు నిర్వహించే ఉచిత స్పీచ్ థెరపి వినికిడి పరీక్షల కేంద్రాన్ని బాలల దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రారంభించారు. జరిగిన తల్లిదండ్రుల అవగాహన సమావేశంలో మోహన్ కుమార్ మాట్లాడుతూ మాటలు ఆలస్యంగా రావడం, వినికిడి సమస్య, ఆటిజం ఏడీహెచ్‌డీ ప్రవర్తన లోపం చదువులో లోపం గల పిల్లల ప్రవర్తనను తల్లి దండ్రులు గమనించి వెంటనే నిపుణులను సంప్రదించాలని కోరారు. ఈ ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైకాలజిస్ట్ కె.రమణ, ఆడియాలజిస్ట్ వాసు, స్పీచ్ తెరపిస్ట్ యమున ఉన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పెదనంది పాడు : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారని నిర్వాహకురాలు పగడాల సుభాషిని తెలిపారు. డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనం, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు, బహుమతుల ప్రధానం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వారోత్సవాలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

విశాలాంధ్ర-మంగళగిరి : నవులూరు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్(18) దివారం ఆత్మకూరులో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. ఈ ఘటన మంగళగిరిలో విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం హుస్సేన్ తాపీ మేస్త్రిగా పనిచేస్తుంటాడు. ఆదివారం ఏదైనా పని ఉంటుందేమో అనే ఉద్దేశంతో మంగళ గిరి వచ్చాడు. అయితే పని దొరక్కపోవటంతో మరో ఇద్దరిని వెంట తీసుకొని ఆత్మకూరు వెళ్లాడు. ఈ సందర్భంలో అక్కడ ఉన్న గుంటూరు ఛానల్ కాలువలో ఈత వేయాలనే ఉద్దేశంతో మిగిలిన వారిని తీసుకొని కాలువలోకి దిగాడు. ఈత వేస్తూ లోనికి వెళ్లాడు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటంతో హుస్సేన్ గల్లంతైనట్లు ఎస్సై విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు.